సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

సిరిసిల్లకల్చరల్: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. పాతబస్టాండ్ సమీపంలోని ఆర్య వైశ్య సంఘ భవనంలో వాసవీమాత సన్నిధానంలో పెద్ద సంఖ్యలో మహిళలు అర్చనలు చేశారు.



న్యూస్‌రీల్

పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలి



నిజామాబాద్‌లో పనులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

కోనరావుపేట(వేములవాడ): పారిశుధ్యం పనులు సక్రమంగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని నిజామాబాద్‌లో శుక్రవారం డ్రైడే పనులు, మన ఊరి మన బడి పనులను పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, డీఈవో రమేశ్‌కుమార్, ఎంపీవో రాజు, వైస్‌ఎంపీపీ వంగపెల్లి సుమలత, మండల వైద్యాధికారి వేణుమాధవ్, ఇరిగేషన్ ఏఈ రాజు, కార్యదర్శి కవిత ఉన్నారు.

బహుజన రాజ్యాధికారం సాధించాలి



మాట్లాడుతన్న బీఎస్పీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: బహుజన రాజ్యాధికారం సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అంకని భాను, జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామి కోరారు. జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గ కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరారు. లింగంపల్లి మధుకర్, బొడ్డు మహేందర్, యారపు రాజబాబు, చెక్కపల్లి శ్రీనివాస్, అనిల్‌కుమార్, నీరటి భాను ఉన్నారు.

'సమ్మెలో మేము పాల్గొనం'



డీడబ్ల్యూవోకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: ఇతర సంఘాలు తలపెట్టిన సమ్మెలో తాము పాల్గొనడం లేదని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(టీఎన్‌జీవోఎస్ అనుబంధ సంఘం) అధ్యక్షురాలు సింగరవేణి పద్మ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. ఈనెల 11 నుంచి ఇతర సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మెకు తమకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి చీటి పద్మ, కె.శ్రీవాణి, అరుణ, వాణి, శారద, దీప్తి, సువర్ణ ఉన్నారు.

ఎల్లమ్మగుట్టను సందర్శించిన సీపీఐ బృందం



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని ఎల్లమ్మగుట్టను సీపీఐ బృందం శుక్రవారం సందర్శించారు. వడ్డెర కార్మికులతో మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఎల్లమ్మగుట్టను నమ్ముకొని కొన్ని వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయన్నారు. గుట్టను చదును చేయడం సరికాదని పేర్కొన్నారు. గుట్టను తొలగించడం ద్వారా ఎన్నో కుటుంబాలు ఉపాధి కోల్పోయే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లమ్మగుట్టను వడ్డెరకార్మికులకు అందజేసి వారికి ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, చంద్రన్న, సోమ నాగరాజు, వడ్డెర సంఘం నాయకులు రమేశ్, కరుణాకర్, రవి, నర్సయ్య, కనకరాజు, సూర నవీన్, సూర నగేశ్ తదితరులు ఉన్నారు.

ముక్కు మూసుకునుడే !



నిలువెత్తు పిచ్చిమొక్కలు పెరిగిన ప్రాంతం సిరిసిల్లలోని అంబికానగర్. చుట్టూ గృహాలు ఉండి.. మధ్యలో ఖాళీ ప్లాట్ ఉంది. యజమాని పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి దోమలు విపరీతంగా తయారయ్యాయి.

ఇది సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్‌నగర్. నివాసాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్‌లో ఇలా వర్షం నీరు చేరి మురికికూపంగా మారింది. అంతేకాకుండా పిచ్చిమొక్కలు పెరగడంతో దోమలు పెరిగాయి. పరిసరాలు సైతం కంపు కొడుతున్నాయి.



వేములవాడ పట్టణంలోని అర్బన్‌కాలనీలో ఖాళీ ప్లాట్లలో పెరిగిన గడ్డి, నిలిచిన మురికినీరు. ఎవరూ పట్టించుకోకపోవడంతో దుర్వాసన వస్తుంది. చుట్టుపక్కల నివసించే వారు మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు.



- మున్సిపాలిటీల్లో కంపుకొడుతున్న కాలనీలు
- ఖాళీ ప్లాట్లు.. మురికినీటికి నిలయాలు
- పందులు, దోమలకు ఆవాసాలు
- పెరుగుతున్న దోమలు.. విజృంభిస్తున్న జ్వరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వేములవాడలో ఇళ్ల మధ్యలో ముళ్లపొదలు

సిరిసిల్లఅర్బన్/వేములవాడఅర్బన్: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో అంతర్గత కాలనీలు అధ్వానంగా ఉన్నాయి. నివాసాల మధ్య మురికికూపాలతో దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయి. గృహాల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు పిచ్చిమొక్కలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఫలితంగా మున్సిపాలిటీల్లో జ్వరబాధితులు పెరుగుతున్నారు.

కొనుగోలు చేసి...నిర్లక్ష్యంగా వదిలి

జిల్లా కేంద్రంగా మారినప్పటి నుంచి సిరిసిల్ల పట్టణంలో ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. చాలా మంది స్థిరాస్తిగా ఉంటుందన్న ఉద్దేశంతో ప్లాట్లను కొని ఖాళీగా వదిలేస్తున్నారు. ఏళ్లు గడిచినా ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. దీంతో ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తాచెదారంతో నిండిపోయాయి. వర్షాకాలం కావడంతో మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ఖాళీ ప్లాట్లలోకి నీరు రాకుండా, పిచ్చిమొక్కలు పెరగకుండా మొరంతో నింపాల్సిన యజమానులు నిర్లక్ష్యంగా ఉండడం స్థానికులకు ఇబ్బందిగా మారింది.

వేములవాడలో కనిపించని ఫాగింగ్

వేములవాడ మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో ఎక్కడ చూసిన మురికికూపాలే కనిపిస్తున్నాయి. మురికి కాల్వల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి దోమలకు నిలయంగా మారాయి. డ్రెయినేజీల పక్కన బ్లీచింగ్ చల్లడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదు.

- నాంపల్లిలోని ఐదోవార్డులో డ్రెయినేజీలను శుభ్రం చేయకపోవడంతో కంపు కొడుతున్నాయి.
- నాంపల్లి బస్టాండ్ వద్ద కరీంనగర్–సిరిసిల్ల రహదారి పక్కన మురికికాల్వలు లేక ఇళ్లలో నుంచి వచ్చే మురికినీరు రోడ్డుపై పారుతుంది.
- ఆరోవార్డు, ఏడో వార్డు తిప్పాపూర్‌లో రహదారి పక్కన డ్రెయినేజీలు లేక మురికి అక్కడే ఆగి కంపుకొడుతుంది.
- తిప్పాపూర్‌లోని 8వ వార్డులో వేములవాడ ఏరియా ఆస్పత్రి ముందు సిరిసిల్ల–వేములవాడ రహదారి పక్కన మురికికాలువ నిండి మురికినీరు రోడ్డుపక్కన నిలిచాయి. ఆ ప్రాంతంలోని ఇళ్లకు వెళ్లాలంటే మురికి నీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి. రాత్రి పూట దోమలతో ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- 8వ వార్డులో హనుమాన్ టెంపుల్ ఏరియా సమీపంలో నూతనంగా నిర్మించిన డ్రెయినేజీ నీరు వెళ్లకుండా అక్కడే ఆగడంతో పరిసరాలు కంపుకొడుతున్నాయి.
- 11వ వార్డులో సీసీరోడ్లు పూర్తిగా లేవు. డ్రెయినేజీలు లేక మురికినీరు ఇళ్ల పక్కన ఆగుతుంది.
- 14వ వార్డులోని అర్బన్‌కాలనీలో డ్రెయినేజీలు లేవు. ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి.

విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి



సిరిసిల్లలోని 23వ వార్డు అంబికానగర్‌లో చాలా వరకు ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. పిచ్చిమొక్కలు పెరిగి, మురుగునీరు నిల్వ ఉంటుంది. విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. ఆరు నెలల క్రితం మా ఇంట్లో ఒకరిని పాము కరిచింది. పిచ్చిమొక్కలు తొలగించాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు.

– పోరండ్ల లక్ష్మీనారాయణ, అంబికానగర్

నోటీసులు జారీ చేస్తాం



జిల్లా కేంద్రంలో చాలా కాలనీల్లో ఉన్న ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగాయి. వర్షానికి నీరు నిలిచి కంపుకొడుతున్నాయి. ఆయా ప్లాట్ల యజమానులకు నోటీసులు జారీ చేశాం. ప్లాట్లను చదును చేయాలని చూసిస్తాం. వాళ్లు స్పందించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– ఎండీ అయాజ్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్

మురికికాలువలు లేవు



మా 11వ వార్డులో మురికికాలువలు లేవు. ఎక్కడి నీరు అక్కడే ఆగుతుండడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

– వారాల వెంకటకృష్ణ, వేములవాడ

ఇళ్ల మధ్యలో ముళ్లపొదలు



14వ వార్డులోని అర్బన్ కాలనీ ప్రాంతంలో మురికినీరు ఇళ్ల మధ్యలోనే ఆగుతున్నాయి. ఇళ్ల పక్కన ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అధికారులు పట్టించుకుని ముళ్లపొదలను తొలగించాలి.

– శ్రావణ్, వేములవాడ

కొత్త రైతులకు బీమా చిక్కులు!

- నూతన రైతు కుటుంబాలకు బీమాలో జాప్యం
- వీరందరి పేరిట బీమా సంస్థకు ప్రీమియం కట్టిన ప్రభుత్వం
- అయినా కొత్త రైతుల పేరిట జనరేట్ కానీ ఇన్సూరెన్స్ ఐడీలు
- మరణించిన కొత్త రైతుకుటుంబాలకు బీమా చెల్లింపులో ఆలస్యం
- త్వరలో సమస్య పరిష్కారిస్తామంటున్న వ్యవసాయాధికారులు





కొమురయ్య(ఫైల్)

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లా కొత్త రైతు కుటుంబాలకు రైతుబీమాలో కొత్త చిక్కులు ఎదురవుతున్నాయి. ఇటీవల తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా విరాసత్ విధానంలో భూములు పొందిన వారికి, కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి రైతులుగా మారిన వారి కుటుంబాలను ఇన్సూరెన్స్ కష్టాలు వెంటాడుతున్నాయి. వాస్తవానికి రైతు అకాల మరణం చెందితే.. అతడి కుటుంబాన్ని ఆదుకునేందుకు కేవలం రెండు వారాల్లో అంటే దాదాపు 14 రోజుల్లో రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం అందజేస్తుంది. ఇందుకు సంబంధించి ప్రీమియం బీమా సంస్థకు ఏటా ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ, 2022 ద్వితీయార్థంలో కొత్తగా భూములకు యజమానులుగా మారిన వారికి తాజాగా కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. వాస్తవానికి వీరందరినీ ప్రభుత్వం ఏనాడో యజమానులుగా గుర్తించింది. రైతు పేరిట పట్టాదారు పాసు పుస్తకం జారీ చేసి, ధరణిలో పేరు కూడా నమోదు చేసింది. కానీ, వీరికి ఇంతవరకూ ఇన్సూరెన్స్ ఐడీలు జనరేట్ కాకపోవడం గమనార్హం.

ఏంటీ సమస్య?

కొత్తగా వ్యవసాయ భూములకు యజమానులుగా మారిన రైతుల పేరిట ప్రభుత్వం బీమా సంస్థకు ఏటా ప్రీమియం చెల్లిస్తుంది. గతంలో బీమా సంస్థకు ప్రీమియం వివరాలు, రైతులకు సంబంధించి ఐడీని కాగితం రూపంలో రైతులకు అందజేసేవారు. ఏటా అదే ఐడీని రెన్యూవల్ చేసేవారు. రెండేళ్లుగా ఈ విధానం ఆన్‌లైన్ అయిపోయింది. దీంతో రైతుల ఇన్సూరెన్స్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే నమోదు అవుతున్నాయి. రైతుకు అతడి పేరిట జనరేట్ అయిన ఐడీ నంబరు మాత్రం చెబుతున్నారు. ఒకవేళ ఆ రైతు ఆకస్మిక మరణం చెందితే.. సదరు ఐడీ ద్వారానే అతడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము వస్తుంది. తాజాగా ప్రభుత్వం రైతు పేరిట బీమా ప్రీమియం చెల్లించినా.. వారికి ఐడీలు జనరేట్ కావడం లేదు. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని సమాచారం. ఇలాంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నాయి. బీమా సంస్థలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో రైతులకు ఇంకా ఐడీలు జనరేట్ కాలేదని సమాచారం.

కల్వచర్లలో ఇలా..

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్లలో కొత్తగా భూమికి యజమానిగా మారిన గోనె కొమురయ్య అనే రైతు పేరిట కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం ధరణిలో పేరునమోదు అయ్యింది. అనుకోకుండా కొమురయ్య ఆగస్టు 19న మరణించాడు. నిబంధనల ప్రకారం అతడి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును రెండు వారాల్లోగా అందజేయాలి. కానీ, మూడు వారాలు గడుస్తున్నా ఇంత వరకూ చెక్కు అందలేదని మృతుడి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఇదేంటని ఆరా తీసిన గ్రామ పెద్దలు.. అసలు కొమురయ్య పేరిట బీమా ఐడీ ఇంకా జనరేట్ కాలేదని తెలుసుకుని అవాక్కయ్యారు. కేవలం కొమురయ్యే కాదు.. కొత్త రైతులందరికీ ఇదే పరిస్థితి ఉందని తెలిసి ఆందోళన చెందుతున్నారు. అయితే, వ్యవసాయాధికారులు మాత్రం కంగారుపడాల్సింది ఏమీలేదని, కాస్త జాప్యమైనా బీమా సొమ్ము వస్తుందని భరోసా ఇస్తున్నారు.

పదుల కుటుంబాల ఎదురుచూపు

కొత్తరైతులుగా నమోదై ఏడాదిలోగా మరణించిన రైతుల సంఖ్య కొత్త జిల్లాల వారీగా పదుల సంఖ్యలో పెండింగ్‌లో ఉందని సమాచారం. సిరిసిల్లలో ఐదుగురు, పెద్దపల్లిలో 32 మంది, కరీంనగర్‌లో సుమారు 10 కుటుంబాలు జగిత్యాలలో ఐదు కుటుంబాలు ఇలా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాయి. అదే సమయంలో అన్ని జిల్లాల వ్యవసాయాధికారులు త్వరలోనే వీరికి పరిహారం అందజేస్తామని స్పష్టంచేస్తున్నారు.

ఆసాముల ఖాతాల్లో పింజర్ల డబ్బులు

- రూ.8.65 కోట్లు చెల్లించిన ప్రభుత్వం
- 29 మంది ఆసాముల డబ్బుల చెల్లింపుల్లో జాప్యం

సిరిసిల్ల: బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసే వస్త్రోత్పత్తిదారుల బ్యాంకు ఖాతాల్లో పింజర్ల డబ్బులు జమయ్యాయి. 2021 నాటి పింజర్ల సబ్సిడీ డబ్బుల కోసం పక్షం రోజుల కిందట ఆసాములు జిల్లా కేంద్రంలో ఆందోళన బాట పట్టారు. స్థానిక పాలిస్టర్ అసోసియేషన్ ఆఫీస్ ముందు రిలే దీక్షలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆసాముల పింజర్ల డబ్బులను విడుదల చేసింది. సిరిసిల్లలోని 136 మ్యాక్స్ సంఘాలకు, 158 చిన్నతరహా పరిశ్రమలకు రూ.8.65 కోట్లు జమచేసింది. బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేసిన కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలోని నేతకార్మికులకు సైతం పింజర్ల డబ్బులు చెల్లించింది. సిరిసిల్లలోని 29 మంది ఆసాముల బ్యాంకు ఖాతాలు సరిగ్గా లేకపోవడం, కొన్ని ఖాతాలు నిర్వహణలో లేకపోవడంతో వారి డబ్బులు జమకాకుండా వెనక్కి వెళ్లినట్లు సమాచారం. అయితే జౌళిశాఖ అధికారులు మళ్లీ బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి టెస్కో అధికారులకు పంపినట్లు తెలిసింది. వస్త్రోత్పత్తిలో నాణ్యత పెంచేందుకు జౌళిశాఖ ఉన్నతాధికారుల సూచనలతో 2021లో వస్త్రోత్పత్తిదారులు తమ సాంచాలకు పింజర్లను బిగించారు. వారు ఉత్పత్తి చేసిన వస్త్రంపై ఒక్కో మీటరుకు రూ.1.50 చొప్పున పింజర్ల డబ్బులు రెండు దఫాలుగా ఇస్తామని 2022లో రూ.5.50 కోట్లు విడుదల చేశారు. రెండో విడత పింజర్ల డబ్బుల కోసం ఇటీవల ఆందోళన చేయగా.. ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది.

అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ బదిలీ

- ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్‌గా నియామకం



బి.సత్యప్రసాద్

సిరిసిల్ల: జిల్లా అడిషనల్ కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.సత్యప్రసాద్ బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది. సత్యప్రసాద్‌ను ఖమ్మం జిల్లా (స్థానిక సంస్థల) అదనపు కలెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఖమ్మంలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేసిన అభిలాష అభినవ్‌ను హైదరాబాద్ సాధారణ పరిపాలన విభాగానికి బదిలీ చేశారు. ఐఏఎస్ 2018 బ్యాచ్‌కు చెందిన బి.సత్యప్రసాద్ 2020 ఆగస్టు 5న జిల్లా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల పాటు జిల్లాలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేశారు. సమర్థ అధికారిగా, వివాదరహితుడిగా పేరున్న సత్యప్రసాద్ సిరిసిల్ల, వేములవాడ మున్సి పాలిటీలకు, వివిధ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛత అవార్డులు సాధించడంలో ముందున్నారు. జిల్లాలో అదనపు కలెక్టర్‌గా సత్యప్రసాద్ స్థానంలో ప్రభుత్వం ఇంకా ఎవరినీ నియమించలేదు.

అర్హులకు న్యాయం చేస్తాం

- వారంపాటు అభ్యంతరాల స్వీకరణ
- దేశాయిపల్లి గ్రామసభలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



అదనపు కలెక్టర్‌తో మాట్లాడుతున్న మహిళలు

బోయినపల్లి(చొప్పదండి): అదనపు టీఎంసీ ముంపు గ్రామం దేశాయిపల్లిలోని అర్హులకు న్యాయం చేస్తామని అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ వద్ద శుక్రవారం గెజిట్ పబ్లికేషన్ గ్రామసభ నిర్వహించారు. ఆర్‌ఐ ప్రభాకర్ గెజిట్ ప్రాథమిక జాబితాలోని 140 మంది పీడీఎఫ్‌ల పేర్లు చదువగా.. తమ పేర్లు రాలేవని పలువురు ఇళ్లు కోల్పోయిన వారు తెలిపారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ గెజిట్ ప్రచురణ విషయంలో అభ్యంతరాలుంటే వారంలోగా కలెక్టర్, ఆర్డీవో, తహసల్దార్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గెజిట్‌లో పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకుంటే అర్హులకు న్యాయం చేస్తామన్నారు. అనర్హులుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. అదనపు టీఎంసీ వరదకాల్వ పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అధికారులు గ్రామంలో సోషల్ ఎకనామిక్ సర్వే చేసిన సమయంలో వయస్సు తక్కువగా ఉండి ఇప్పుడు వయస్సులో అర్హులైన వారు తమ పేర్లు గెజిట్‌లో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నారు. గ్రామసభలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ పుష్పలత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమేశ్, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఆర్డీవో కార్యాలయ ఆర్‌ఐ రమేశ్, సర్పంచ్ ఒంటెల రాజగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కొంకటి శిరీష, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, కొంకటి మధు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

- మండల కేంద్రంలో భారీ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్షం నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ అఖిల పక్షం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందించారు. సాధన సమితి కన్వీనర్ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి మండలాలను కలుపుతూ ఎల్లారెడ్డిపేటలో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, నాయకులు గౌస్, లింగంగౌడ్, స్వామిగౌడ్, నీరటి భాను, లింగాల సందీప్, దొమ్మాటి నర్సయ్య, సూర్యనాయక్, రాజేందర్, రాజునాయక్, సంపత్, మహేశ్, అంజయ్య, లక్ష్మీరాజం, రాజు, కిషన్, చిరంజీవి, సాయిచంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయినికి సన్మానం


గోల్డ్ మెడల్ సాధించిన ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న నాయకులు

చందుర్తి(వేములవాడ): మండలంలోని బండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని భాగ్యలక్ష్మి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్ సాధించగా.. తోటి ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ న్యాత విజయజార్జ్ శుక్రవారం సన్మానించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ ఫిజికల్ సైన్స్‌లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ అంబాల దాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు న్యాత పద్మ, బుర్ర రేణుక, సీఏ నక్క కవిత పాల్గొన్నారు.

బీజేపీ నుంచి మల్కపేటవాసి దరఖాస్తు


టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న తిరుపతి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మల్కపేటకు చెందిన బీజేపీ నాయకుడు బొల్లారం తిరుపతి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాడు. తిరుపతి మాట్లాడుతూ 2002లో విద్యాసాగర్‌రావు సమక్షంలో బీజేపీలో చేరి సేవలందిస్తున్నానని, అధిష్టానం ఆదేశిస్తే వేములవాడ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానన్నారు.

దొంగతనం కేసులో 10 నెలల జైలు

సిరిసిల్లక్రైం: బైక్ చోరీ కేసులో ఇద్దరికి 10 నెలల జైలుశిక్ష విధిస్తూ జడ్జి హిమబిందు శుక్రవారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు. గత జనవరి 16న సిరిసిల్ల కొత్త బస్టాండ్ వద్ద పార్క్‌చేసిన బైక్ చోరీకి గురైందని అల్లె నాగరాజు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బైక్‌ను చోరీ చేసిన నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన మలావత్ తులసీరామ్, రాథోడ్ వినోద్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితులు తులసీరామ్, వినోద్‌కు 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించారని టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

20న హుండీల లెక్కింపు

- సిరిసిల్ల వెంకన్న ఆలయ ఈవో మారుతిరావు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని ఆలయాల్లోని హుండీలను ఈనెల 20న లెక్కించనున్నారు. ఈమేరకు ఆలయాల ఈవో మారుతిరావు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటలకు పోచమ్మ ఆలయం, 11గంటలకు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, మధ్యాహ్నం 12 గంటలకు విశ్వనాథస్వామి ఆలయం, మధ్యాహ్నం 1.30 గంటలకు శివసాయి బాబా ఆలయాల్లో హుండీలు లెక్కింపు ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

రాజీపడుతున్నారు

- సత్ఫలితాలిస్తున్న రాజీమార్గం
- జిల్లాలో వందలాది కేసుల పరిష్కారం
- నేడు జాతీయ మెగా లోక్‌అదాలత్
- సిరిసిల్ల, వేములవాడ కోర్టుల్లో నిర్వహణ

‘తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన బొల్లి రవీందర్ 2021 జూన్ 10న రగుడుచౌరస్తాలో ట్రక్కు ఢీకొని మృతిచెందాడు. బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా.. ఇరువర్గాల వారు లోక్‌అదాలత్‌ను సంప్రదించారు. గత జూన్ 10న జరిగిన లోక్‌అదాలత్‌లో బాధిత కుటుంబానికి రూ.17 లక్షలు చెల్లించడానికి జిల్లా జడ్జి ప్రేమలత అవార్డు జారీ చేశారు. ఇరుపక్షాలు సమన్యాయం జరిగిందని అంగీకరించి రాజీపడ్డారు.’

2023 నుంచి కేసుల పరిష్కారం ఇలా..

క్రిమినల్ కేసులు	: 373
సివిల్ కేసులు	: 16
ఆర్థిక తగాదాలు	: 01
వాహన ప్రమాదాలు	: 13
బ్యాంకు కేసులు	: 50
బీఎస్ఎన్ఎల్	: 12
గృహహింస	: 02
మెయింటనెన్స్	: 03
మొత్తం	: 470


జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా జడ్జి (ఫైల్)

సిరిసిల్లటౌన్: ఏళ్లకేళ్లు కోర్టుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకూడదనే రాజీమార్గాన్ని అనుసరిస్తున్నారు. ఇటీవల రాజీపడుతున్న వారి సంఖ్య జిల్లాలో పెరుగుతుంది. రాజీపడే కేసులపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కల్పిస్తుండడంతో ఇటీవల లోక్ అదాలత్‌లలో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమవుతున్నాయి. ప్రతి రెండు నెలలకోసారి జాతీయ మెగా లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారు. నేడు జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా ప్రత్యేక కథనం.

అదాలత్‌లో అంతిమతీర్పు

లోక్ అదాలత్‌లలో కేసుల పరిష్కారంతో డబ్బు, సమయం ఆదా అవుతాయి. లోక్ అదాలత్‌లలో లభించిన తీర్పు అంతిమం కావడంతో మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదు. దేశవ్యాప్తంగా కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి ప్రతి రెండు నెలలకోసారి మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ, న్యాయస్థానాల్లో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నారు. ఇందుకు జిల్లా నాయసేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రిలిటికేషన్ కేసులకు సత్వర పరిష్కారం చూపుతుంది. కేసులు పరిష్కారం కావడంతో రెగ్యులర్ కోర్టులో చెల్లించిన ఫీజు తిరిగి పొందవచ్చు.

సుమారు 1500 కేసులు

జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల పరిధిలో రాజీ పడే అవకాశం ఉన్న కేసులు సుమారు 1500 వరకు ఉన్నాయి. ఇక రెగ్యులర్ కోర్టుల్లో పెండింగ్ కేసులను కక్షిదారుల రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి లోక్ అదాలత్‌లు ఉపయోగపడుతున్నాయి. ఇందులో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్, పోలీసులు, న్యాయవాదుల సహకారం తీసుకుంటున్నారు. ఈ మెగా అదాలత్ చైర్మన్‌గా సిట్టింగ్ జడ్జి, లేదంటే రిటైర్డ్ జడ్జి, సభ్యులుగా ఒక న్యాయవాది, ఒక స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు ఉంటారు.

అదాలత్ ఉపయోగాలు ఇలా..

- సివిల్, ప్రమాదబీమా, కుటుంబ తగాదాలు, రుణాలు, ఎక్సైజ్, చిట్‌ఫండ్, ప్రీ లిటికేషన్ కేసుల పరిష్కారానికి అదాలత్ వేదికగా నిలుస్తుంది.
- రాజీపడే కక్షిదారులకు ముందుగానే నోటీసులు జారీచేసి వేదికకు పిలిచి ఇరువర్గాల మధ్య రాజీ కుదుర్చుతారు.
- కక్షిదారుల్లో ఇరువర్గాలకు న్యాయం చేయడానికి న్యాయ సేవాధికార సంస్థ వారధిగా పనిచేస్తుంది. నిరుపేదలకు ఉచిత న్యాయం లభిస్తుంది.
- న్యాయసేవల వివరాలు తెలుసుకోవాలనుకునే వారు హెల్ప్‌లైన్ 15100లో సంప్రదించవచ్చు.

కోర్టు ఫీజు తిరిగిస్తారు



అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే రెగ్యులర్ కోర్టుకు చెల్లించిన ఫీజులు తిరిగి ఇస్తారు. ఉచిత న్యాయాన్ని పొందవచ్చు. కక్షిదారులు పంతాలకు పోకుండా రాజీ కుదుర్చుకోవాలి.

– చింతోజు భాస్కర్, జిల్లా లోక్ అదాలత్ సభ్యుడు

రాజీమార్గమే ఉత్తమం



ప్రీ లిటికేషన్, ప్రమాదాలు, రాజీపడే క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాల్లో ఇరుపక్షాలు రాజీమార్గాన్ని అనుసరించాలి. అదాలత్‌లో తీర్పుపై హైకోర్టులకు అప్పీలు చేసుకోరాదు. ప్రజలు ఉచిత న్యాయసేవలకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ జనవరి నుంచి పనిచేస్తుంది. ఎలాంటి న్యాయ సలహాలకైనా సంప్రదించవచ్చు.

– ఎస్.ప్రేమలత, జిల్లా జడ్జి

టెట్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- 15 కేంద్రాలు.. 3,378 మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్


సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాకేంద్రంలో సెప్టెంబరు 15న నిర్వహించే టెట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. సిరిసిల్లలో 15 కేంద్రాల్లో 3,378 మంది మొదటి పేపర్, 14 కేంద్రాల్లో 2,937 మంది పరీక్షలు రాస్తారని వివరించారు. 15వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 135 మంది ఇన్విజిలేటర్లను, 15 మంది చీఫ్ సూపరిటెండెంట్లను, 15 మంది డిపార్టుమెంట్ అధికారులను, 53 మంది హాల్ సూపరింటెండెంట్లను నియమించినట్లు వివరించారు. హాల్‌టిక్కెట్లలో తప్పులుంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సరైనపత్రాలతో వెళ్లి సవరించుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్‌కుమార్, ప్రభుత్వ పరీక్షల విభాగం సహాయ కమిషనర్ అజీమ్, ×సెస్౯ ఎండీ సూర్య చంద్రరావు, ఉపవైద్యాధికారి రజిత, ఆర్టీసీ, పోలీస్, రెవెన్యూ, ట్రెజరీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులపై చర్యలు

- 11 మంది బైండోవర్
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: పండుగలు, ఎన్నికల సందర్భంగా కులాలు, మతాలు, పార్టీల మధ్య విభేదాలు సృష్టించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, పార్వర్డ్ చేసినా గ్రూప్ అడ్మిన్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్‌మహాజన్ శుక్రవారం హెచ్చరించారు. కోనరావుపేట, ఇల్లంతకుంట ఠాణాల పరిధిలో సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన 11 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. సోషల్‌మీడియా గ్రూప్‌పై అడ్మిన్‌లు నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు.

రైతులకు పంట రుణాలివ్వాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి


బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో రైతులకు పంటరుణాలు సకాలంలో అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిందని, నెలాఖరులోగా వాటిని పూర్తిచేసి, రైతులకు పంటరుణాలు ఇవ్వాలన్నారు. జననీ సురక్ష పథకం లక్ష్యాలను సాధించిన బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. పీఎం స్వానిధిలో మున్సిపాలిటీ పరిధిలోని వీధివ్యాపారులకు రుణాలివ్వాలని, పాడిగేదెల యూనిట్లకు, మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వాలన్నారు. మండల స్థాయిలో బ్యాంకర్లు సమావేశాలు నిర్వహించి, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. చేనేత, మరమగ్గాల కార్మికుల వ్యక్తిగత, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. లీడ్ బ్యాంకు మేనేజర్ టీ.ఎస్.మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, లీడ్ బ్యాంకు రీజినల్ హెడ్ అపర్ణారెడ్డి, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఉపేందర్‌రావు, జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి శివకుమార్, జౌళిశాఖ ఏడీ సాగర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీ బిడ్డనైన నన్ను గెలిపించండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్


కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: బీసీ బిడ్డనైన తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం రుద్రవరంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఓటువేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇందిరమ్మ ఇంటి కింది రూ.5 లక్షలు, ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు పిల్లి కనకయ్య, తాడెం శ్రీనివాస్, కత్తి కనకయ్య, ఎర్రం రాజు, ఎర్రం ఆగయ్య, సత్తయ్య, బస రాజశేఖర్, సింగపూరి మల్లయ్య, నాగుల మనోహర్, లచ్చయ్య, మల్లయ్య, బాలరాజు, ప్రభాకర్, పర్శ రాములు, శ్రీనివాస్, తిరుపతి, రాజిరెడ్డి ఉన్నారు.

మిడ్‌మానేరుకు వరద

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరుకు వరద ఇన్‌ఫ్లో వస్తుంది. ప్రాజెక్టులోకి శుక్రవారం 5 వేల క్యూసెక్కుల మేర వరద ఇన్‌ఫ్లోగా వస్తోంది. ఐదు గేట్ల ద్వారా ఎల్ఎండీకి 5,130 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రాత్రి 7 గంటల వరకు మిడ్‌మానేరు ప్రాజెక్టులో 20.06 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

అదుపుతప్పి కారు బోల్తా

చందుర్తి(వేములవాడ): ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇచ్చే క్రమంలో కారు అదుపుతప్పి బోల్తాపడ్డ సంఘటన మండలంలోని బండపల్లి శివారులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. మేడ్చల్ జిల్లా కొకండకు చెందిన సన్నె రవి కుటుంబ సభ్యులతో కలిసి కారులో నిర్మల్ జిల్లా బాసరకు వెళ్లి తిరిగి వేములవాడకు వస్తున్నారు. మండలంలోని బండపల్లి శివారులో కారు అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో రోహిత్ అనే బాలుడికి తీవ్రగాయాలు కాగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

రైతు దంపతులపై కేసు

చందుర్తి(వేములవాడ): భూ తగాదాలను దృష్టిలో పెట్టుకొని పత్తిపంటపై గడ్డిమందు పిచికారీ చేసిన దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన ఎక్కలదేవి రాజయ్యకు చెందిన పత్తి పంటపై అదే గ్రామానికి చెందిన గంగరాజు–లక్ష్మి దంపతులు గడ్డిమందు పిచికారీ చేశారు. బాధితుడు రాజయ్య ఫిర్యాదుతో గంగరాజు–లక్ష్మి దంపతులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జిల్లాలో చిరుజల్లులు

సిరిసిల్ల: జిల్లాలో శుక్రవారం అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. రుద్రంగిలో అత్యధికంగా 2.6 మిల్లీమీటర్ల వర్షం పడగా.. వేములవాడరూరల్, బోయినపల్లి, వేములవాడ, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో వర్షం పడలేదు. చందుర్తిలో 0.3 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 0.4, కోనరావుపేటలో 0.5, వీర్నపల్లిలో 1.3, ఎల్లారెడ్డిపేటలో 0.3, గంభీరావుపేటలో 1.2, ముస్తాబాద్‌లో 0.5 మిల్లీమీటర్ల తేలిక పాటి జల్లులు కురిశాయి.

గంజాయి సేవిస్తున్న ఒకరి రిమాండ్

సిరిసిల్లక్రైం: వేములవాడకు చెందిన వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి తాగుతున్న వ్యక్తిని సిరిసిల్లటౌన్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వరంగల్ జిల్లా రామోజీపేటకు చెందిన జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో ఐలవేణి సుమన్ అలియాస్ అర్జున్ ఉంటున్నాడు. ఇతను వేములవాడలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ చీర్లవంచకు చెందిన బండి రాజేశ్‌కు రూ.1,100 ఇచ్చి గంజాయి కొనుగోలు చేశాడు. దీన్ని తీసుకుని సిరిసిల్ల కార్గిల్ లేక్ వద్దకు వెళ్లి సేవించేందుకు ప్రయత్నించగా ఎస్సై మల్లేశం పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పంచాయతీలో అక్రమాలపై విచారణ

- రశీదు పుస్తకాలు స్వాధీనం


రశీదులు, రిజిస్టార్లు పరిశీలిస్తున్న ఎంపీవో ఆరీఫ్

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీలో అక్రమాలపై ఎంపీవో ఆరిఫ్ శుక్రవారం విచారణ చేపట్టారు. 001 నంబర్ నుంచి ఉన్న రెండు రశీదు బుక్కులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సిబ్బంది చెల్లించిన చలాన్లు, ఎస్‌టీవో జమ, ఖర్చులను పరిశీలించినట్లు వివరించారు. జరిమానాల రశీదు పుస్తకాలను ప్రింటింగ్ కోసం అని రాసిన తీర్మానంలో పంచాయతీ కార్యదర్శి సంతకం లేనట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎంత జరిమానాలు, చిల్లర రశీదు రూపంలో ఎంత మేరకు వసూలు చేస్తున్నారనే దానిపై ఆరా తీస్తామని చెప్పారు. కాగా కొత్త రశీదుల ప్రింటింగ్, రశీదుల చెల్లింపులపై తమకు సమాచారం లేదన్నారు. ఎంపీడీవో అనుమతి మేరకు బుక్కులు ప్రింటింగ్‌కు ఇచ్చామని రిజిస్టర్‌లో సంతకం లేకుండా రాయడం కొసమెరుపు.

కాంగ్రెస్ నేతల ధర్నా

మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు జీపీ ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ నాయకుడు దీటి నర్సింలు మాట్లాడుతూ నకిలీ రశీదు బుక్కులు కొట్టించి ప్రజాధనాన్ని కాజేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సద్ది మధు, గొండయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలు.. నిరసనలు

- సిరిసిల్లలో కొనసాగిన దీక్షలు


బతుకమ్మ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు


ఒంటికాలుపై నిల్చొని ఎన్‌హెచ్‌ఎం వర్కర్ల నిరసన

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసనలు కొనసాగాయి. మాజీ సర్పంచులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రిలేదీక్షలు కొనసాగించారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు అంబేడ్కర్‌చౌరస్తాలో వినూత్నంగా బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేశ్, వెంకటస్వామి, ఉపేందర్ ఉన్నారు.

ఒంటికాలిపై ఎన్‌హెచ్‌ఎంల నిరసన

కొద్ది రోజులుగా నిరవధిక రిలేదీక్షలు చేస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ స్కీం వర్కర్లు శుక్రవారం ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమ సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం స్కీం వర్కర్లు పి.రాణి, గిరిధర్, శ్వేత, ఫాజల్, ప్రవీణ్, సునంద, ఫర్వీస్, వనిత, వెంకటేశ్, బాలకృష్ణ, లలితమ్మ, రాజమణి, శేఖర్ పాల్గొన్నారు.

సర్కారు నిర్లక్ష్యం వీడాలి..

మాజీ సర్పంచులపై రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం వీడాలని వారు కోరారు. మాజీ సర్పంచులు చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారంతో 31వ రోజుకు చేరాయి. బొడ్డు దేవయ్య, సంపునూరి మల్లేశంగౌడ్, అలువాల లక్ష్మణ్, దేవుని నర్సయ్య, గోవర్ధన్, సత్యనారాయణరెడ్డి, పైలూరి రాజమల్లు పాల్గొన్నారు.

శివ కుటుంబాన్ని ఆదుకోవాలి

- కె.కె.మహేందర్‌రెడ్డి


పరామర్శిస్తున్న కె.కె.మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గుండెపోటుతో మృతిచెందిన యువకుడు ఆవునూరి శివ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి కోరారు. నిరుపేద యువకుడైన శివ మృతితో అతని భార్య, కొడుకు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన శివ నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందగా శుక్రవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన గొర్రె రాజం, రాచర్ల తిమ్మాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుండ్ల కాశయ్య కుటుంబీలను సైతం మహేందర్‌రెడ్డి పరామర్శించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి లింగంగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ రఫీక్, నాయకులు దొమ్మాటి నర్సయ్య, చెన్ని బాబు, గుండాటి రాంరెడ్డి, సిరిసిల్ల సురేశ్ ఉన్నారు.

సిరిసిల్ల బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

- మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్
- బీజేపీ టిక్కెట్ కోసం దరఖాస్తు


దరఖాస్తు అందజేస్తున్న ఆడెపు రవీందర్

సిరిసిల్ల: సిరిసిల్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఆఫీస్‌లో దరఖాస్తు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్‌గా, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడిగా, మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన తనకు సిరిసిల్ల బరిలో నిలిచే అవకాశం కల్పించాలని కోరారు. 1994 నుంచి బీజేపీలో పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ పరంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, జాతీయ కౌన్సిల్ మెంటర్‌గా పనిచేసినట్లు వివరించారు. నాయకులు గాజుల వేణు, కోడం ఆనంద్‌బాబు, గాజుల సదానందం, ఆడెపు శ్రీకాంత్, దుబాల కొండయ్య, గోన మల్లేశం తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణుల పక్షపాతి సీఎం కేసీఆర్


మాట్లాడుతున్న సుమలతశర్మ

గంభీరావుపేట(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ బ్రాహ్మణుల పక్షపాతి అని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యురాలు సంకెపల్లి సుమలతశర్మ పేర్కొన్నారు. గంభీరావుపేటలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్నివర్గాలకు ప్రాధాన్యం ఇస్తూనే బ్రాహ్మణుల కోసం ఏ ముఖ్యమంత్రి అమలు చేయని కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేసి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తున్నారన్నారు. బ్రాహ్మణుల పిల్లల విదేశీ విద్యకు రూ.20లక్షలు అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన బ్రాహ్మణ విద్యార్థులు ఈనెల 15 వరకు విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనుచితవ్యాఖ్యలు చేస్తే కేసులు



వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోనరావుపేట(వేములవాడ): ఇతరులపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఆంజనేయులు హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు ఆదిశ్రీనివాస్‌పై సుద్దాలకు చెందిన అంబోజి వెంకటేశ్ ఫేస్‌బుక్‌లో చేసిన పోస్ట్‌పై ఫిర్యాదు అందడంతో అదుపులోకి తీసుకొని తహసీల్దార్ విజయ్‌ప్రకాశ్‌రావు ముందు బైండోవర్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రజాస్వామ్య విధానంలో అందరికీ పోటీచేసే అధికారం ఉంటుందని తెలిపారు. ఇతరుల మనోభావాలను కించపరిచేలా వ్యక్తిగతంగా వ్యాఖ్యలు చేస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉత్తమ బోధనే గురువుల బాధ్యత


సన్మానిస్తున్న గోపా నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉత్తమ విద్యాబోధన గురువుల బాధ్యత అని మండల గోపా అధ్యక్షుడు కదిరె రమేశ్‌గౌడ్ అన్నారు. మండల గౌడ సంక్షేమ సంఘం కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇటీవల పురస్కారాలు అందుకున్న చెట్కూరి రజిత, బైరగోని అనిల్‌గౌడ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పాముల ఆంజనేయులుగౌడ్, నాయకులు మర్తనపేట లక్ష్మణ్‌గౌడ్, బుర్ర ఉపేందర్‌గౌడ్, కదిరె శ్రీనివాస్‌గౌడ్, చింతకింది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.